నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శనివారం 6 జనవరి 2024 | MAHABUBNAGAR NARAYANPET


మహబూబ్‌నగర్‌లో విద్యుద్దీపాలతో వెలుగుతున్న అబ్దుల్‌ఖాదర్ దర్గా

### మతసామరస్యానికి ప్రతీక
# అబ్దుల్ ఖాదర్ దర్గా

- నేటి నుంచి ఉత్సవాలు, 7న గంధోత్సవం
- హాజరుకానున్న గుల్బర్గా పీఠాధిపతి బాదేషా ఖాద్రి

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 5 : జిల్లా కేంద్రంలోని అబ్దుల్ ఖాదర్‌షా ఉత్సవాలు ఈ నెల 6నుంచి ప్రారంభంకానున్నాయి. 85వ ఉర్సును పురస్కరించుకొని నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా ప్రతియేటా నిర్వహించే ఉర్సు వేడుకల్లో కుల, మతాలకతీతంగా ప్రజలు పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు. అబ్దుల్‌ఖాదర్ దర్గాకు ఎంతో చరిత్ర ఉన్నది. అన్ని మతాలు, కులాల ప్రజలకు ఆరాధ్యంగా నిలిచింది. అబ్దుల్ ఖాదర్‌షా ఓ పోలీస్ కానిస్టేబుల్ 1929లో కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డ నుంచి మహబూబ్‌నగర్‌కు వచ్చి ఇక్కడే స్థిరపడినట్లు ముస్లిం మతపెద్దలు చెబుతారు. ఆయన పోలీస్ విధులు నిర్వహిస్తూనే దైవచింతన, ఆధ్యాత్మిక భావనతో ప్రజలను చేరదీసేవారు. తన ఉద్యోగ విరమణ అనంతరం ఆయన జిల్లా కేంద్రంలోని రాయిచూర్ రోడ్డులో ఓ చెట్టు కింద కూర్చొని ప్రజలకు హితబోధ చేసేవారు. ప్రతి గురు, శుక్రవారాల్లో ఖాదర్‌షా వద్దకు చుట్టుపక్క గ్రామాల ప్రజలు తరలివచ్చి తమ బాధలు, సమస్యలను విన్నవించుకునేవారు. ఆయన సామరస్యంతో పరిష్కార మార్గాలను చెప్పేవారని చరిత్ర చెబుతున్నది. ఖాదర్‌షా మరణానంతరం కుటుంబ సభ్యులు ఖాదర్‌షా ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు రాయిచూర్ రోడ్డు పక్కనే నిర్మించిన ఆయన సమాధిపై దర్గాను ఏర్పాటు చేశారు. అప్పటినుంచి దర్గాను కుల, మతాలకతీతంగా దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది.

**జలాభిషేకంతో ఉత్సవాలు ప్రారంభం**

ఈ నెల 6నుంచి అబ్దుల్ ఖాదర్ షా దర్గా ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. 6న జలాభిషేకం(గుసూల్ షరీఫ్), 7న సాయంత్రం 4గంటలకు గంధోత్సవం షేక్ బడేసాబ్ ఇంటి నుంచి బయలుదేరి అశోక్‌టాకీస్ చౌరస్తా, ఎస్‌బీహెచ్ రోడ్డు, తూర్పు కమాన్, పోలీస్ క్లబ్ నుంచి వన్‌టౌన్ చౌరస్తా గుండా దర్గాకు చేరుకుంటుంది. అక్కడ చాదర్ సమర్పించి ఫాతేహా అందజేస్తారు. ఉర్సు వేడుకల్లో నాగ్‌పూర్ చెందిన ప్రముఖ ఖవ్వాలి బృందం ఖవ్వాలి నిర్వహించనున్నారు. దాదాపు వారం రోజులపాటు జరిగే ఉర్సు వేడుకలు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ముంబై, హైదరాబాద్, రాయిచూర్ తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొంటారు. ఈ వేడుకల్లో గుల్బర్గా పీఠాధిపతి కర్ణాటక ప్రసిద్ధ గుల్బర్గా షరీఫ్ దర్గాకు చెందిన పీఠాధిపతి హజ్రత్ సయ్యద్ హిదాయతుల్లా బాదేషా ఖాద్రి అల్ బాగ్దాదితోపాటు ప్రముఖ దర్గాల పీఠాధిపతులు హాజరుకానున్నారు. స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులుతోపాటు పట్టణ ప్రముఖులు వేడుకలో పాల్గొననున్నారు. ఈ ఉత్సవాలకు సంబంధించి భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు



పుల్లూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి, జనవరి 5 : ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పుల్లూరు, తక్కశిల గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో పాల్గొని ప్రజలకు నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులకు రేషన్‌కార్డుతోపాటు ప్రభుత్వం ఇచ్చే ఐదు గ్యారెంటీలు అమలు చేస్తారని, దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిరంతరం ఉంటుందని, ఇప్పుడు ఇవ్వలేదని అధైర్యపడొద్దని, మీ పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తులు ఎప్పుడైనా అందించవచ్చని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ వెంకట్రావు, ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, పీఏసీసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# మైసమ్మ ఉత్సవాలు ప్రారంభం

- ధ్వజారోహణంతో అంకురార్పణ


ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

నవాబ్‌పేట, జనవరి 5 : మండలంలోని ఫతేపూర్ మైసమ్మ దేవత బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పాలకవర్గ సభ్యులు, కాకర్లపహాడ్ గ్రామస్తులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. గణపతిపూజ, కలశస్థాపన, ధ్వజారోహణ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగానే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ పాశం కృష్ణయ్య, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ జంగమ్మ, ఉపసర్పంచ్ పెంటయ్య, మాజీ చైర్మన్ పాశం గోపాల్, నాయకులు సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, మాసయ్య, ఆంజనేయులు, పెంటయ్య, నారాయణరెడ్డి, నర్సిములు, బాలకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# కందులు క్వింటా @ రూ.8,661

- బాదేపల్లి మార్కెట్‌లో మరింత పెరిగిన పప్పు ధర


బాదేపల్లి మార్కెట్‌కు తీసుకువచ్చిన కందులు

జడ్చర్ల, జనవరి 5 : కందులకు రోజురోజుకు ధరలు పెరుగుతున్నాయి. గురువారం క్వింటా రూ.8,509ధర పలుకగా శుక్రవారం రూ.8,661 కి పెరిగాయాయి. అంటే ఒక్కరోజులోనే దాదాపుగా రూ.160 పెరిగింది. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 177 క్వింటాళ్ల కందులు అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.8,661, కనిష్ఠంగా రూ.8,169, మధ్యస్తంగా రూ.8,661 ధర పలికింది. అదేవిధంగా 352 క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యం అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠం గా రూ.3,134, కనిష్ఠంగా రూ.2,839, మధ్యస్తం గా రూ.3,134 ధర లభించింది. అలాగే 20క్వింటాళ్ల మొక్కజొన్న అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,170, కనిష్ఠంగా రూ. 2,170, మధ్యస్తంగా రూ.2,170 ధర వచ్చింది. 84క్వింటాళ్ల హంస ధాన్యం అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.2,125 ధర పలికింది. మార్కెట్‌కు 774క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా దానికి క్వింటాళుకు గరిష్ఠంగా రూ.8,209 ధర పలికినట్లు అధికారులు తెలిపారు.

# చిరుతదాడిలో దూడ హతం


చిరుతదాడిలో మృతి చెందిన దూడ

కోయిలకొండ జనవరి 5 : చిరుత దాడిలో ఆవుదూడ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. అటవీ అధికారుల వివరాల ప్రకారం.. మండలంలోని చందాపూర్‌కు చెందిన రైతు మొగులయ్య గురువారం రాత్రి పొలంలో పశువులను కట్టేసి ఇంటికి రాగా చిరుత ఆవుదూడపై దాడిచేసి కొంత దూరం తీసుకువెళ్లి చంపింది. గ్రామస్తుల సమాచారం మేరకు అటవీ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రైతుకు నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని బీట్ అధికారులు పేర్కొన్నారు.


బాలానగర్‌లో ఆగ్రహంతో నిప్పంటించడంతో తగలబడుతున్న ప్రమాదానికి కారణమైన డీసీఎం

- డీసీఎం ఢీకొనడంతో ఐదుగురు మృతి
- ఇద్దరి పరిస్థితి విషమం, దవాఖానకు తరలింపు
- స్థానికుల్లో కట్టలు తెంచుకున్న ఆక్రోశం
- ప్రమాదానికి కారణమైన వాహనానికి నిప్పు
- రూరల్ సీఐ, పోలీసులపై సైతం దాడి
- హైవే-44పై భారీగా ట్రాఫిక్ జాం
- మూడు గంటలపాటు నిలిచిన వాహనాలు


బాలానగర్‌లో జరిగిన ప్రమాదంలో రోడ్డుపై చెల్లాచెదురుగా మృతదేహాలు

# బాలానగర్‌లో ఉద్రిక్తత


బాలానగర్‌లో జాతీయ రహదారిని దిగ్బంధించిన స్థానికులు

మహబూబ్‌నగర్ (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/జడ్చర్ల/బాలానగర్, జనవరి 5 : బాలానగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం కలిచివేసింది. అభం.. శుభం తెలియని చిన్నారులు సైతం మృత్యు శకటంలా దూసుకొచ్చిన డీసీఎం కింద నలిగిపోయారు. బాలానగర్‌లో జరిగిన సంతకు వచ్చిన మోతిఘణపూర్, బీబీనగర్‌తోపాటు పలు గ్రామాలు, తండా వాసులతోపాటు బీహార్‌కు చెందిన కూలీలు సైతం విగత జీవులుగా మారారు. శుక్రవారం సాయంత్రం 5:30 గంటలకు హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు టైర్ల లోడ్‌తో వేగంగా వెళ్తున్న డీసీఎం (ఏపీ 03 పీఏ 5898) కంట్రోల్ తప్పింది. మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న బైక్‌ను, రోడ్డు దాటుతున్న ఐదుగురితోపాటు ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరితోపాటు రోడ్డు క్రాస్ చేస్తున్న ఐదుగురు ప్రమాదానికి గురయ్యారు. బీబీనగర్ తండాకు చెందిన జున్ను(3), ఫణి (50), మోతిఘనపూర్‌కు చెందిన తల్లీబిడ్డలు పింకి అలియాస్ మోక్ష(8), సునీత(32), బాలానగర్‌కు చెందిన జశ్వంత్(10) అక్కడికక్కడే మృతి చెందారు. మధ్యప్రదేశ్‌కు చెందిన భద్రాసింగ్, బీబీనగర్ తండాకు చెందిన మౌనిక తీవ్రంగా గాయపడగా.. మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. మౌనిక చికిత్స పొందుతుండగా.. భద్రాసింగ్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించారు. గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను జిల్లా కలెక్టర్ రవి నాయక్ ఆదేశించారు.

**డీసీఎంకు నిప్పు**

ఐదుగురు ప్రాణాలు కండ్ల ముందే గాలిలో కలిసిపోవడంతో స్థానికులు ఆగ్రహానికి గురయ్యారు. కొద్ది దూరం వెళ్లాక స్థానికులు కేకలు వేయడంతో డీసీఎంను నిలిపి డ్రైవర్ పరారయ్యాడు. స్థానికుల్లో ఆవేశం కట్టలు తెంచుకోవడంతో డీసీఎంకు నిప్పు పెట్టారు. మంటల్లో వాహనం పూర్తిగా కాలిపోయింది.

**ఉద్రిక్తత**

బాలానగర్‌లో రోడ్డు ప్రమాదంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అదుపులోకి తీసుకోవడానికి అక్కడకు బాలానగర్ పోలీసులు చేరుకున్నారు. అయితే పోలీసుల నిర్లక్ష్యంతోనే సంఘటన జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితిని జడ్చర్ల రూరల్ సీఐ జములప్పకు వివరించగా.. ఆయన ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలానగర్, రాజాపూర్ ఎస్సైలు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌తో కలిసి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు యత్నించారు. ఆగ్రహించిన గ్రామస్తులు వారితో గొడవపడి దాడి చేశారు. దీంతో చేసేది లేక పోలీసులు పరారయ్యారు. ఘటనా స్థలం నుంచి తలోదిక్కు పారిపోయారు. పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అంతసేపు స్థానికులు హైవేను దిగ్బంధించారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9:30 వరకు జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలానికి వచ్చి బాధితులకు న్యాయం చేయాలని భీష్మించుకూర్చున్నారు. పరిస్థితి ఉద్రుతంగా మారడంతో ఎస్పీ నరసింహ, డీఎస్పీ అదనపు బలగాలతో బాలానగర్‌కు చేరుకున్నారు. ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసి పరిస్థితిని చక్కదిద్దారు.

**జాతీయ రహదారి దిగ్బంధనం**

ఘోరరోడ్డు ప్రమాదం జరగడంతో స్థానికులు, మృతుల బంధువులు ఆగ్రహంతో ప్రమాదానికి కారణమైన డీసీఎంను దహనం చేశారు. స్థానికులు, మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారిని దిగ్బంధనం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుల బంధువులు, స్థానికులతో చర్చించినా ఎవరూ వినిపించుకోలేదు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే రా వాలని, మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వారు వచ్చే వరకు రోడ్డుపైనుంచి వెళ్లేది లేదని, ఎస్సై డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తు రోడ్డుపైనే ఉన్నారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నారు. చేయడంతో రోడ్డుకు ఇరువైపులా రెండు గంటలకు పైగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో దాదాపు 15కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**కేక్ కోసం వెళ్లి..**

బాలానగర్‌కు చెందిన జస్వంత్(6) తన పుట్టిన రోజు ఉండటంతో కేక్ తీసుకురావడానికి సంతబజార్‌కు వచ్చాడని తిరిగి వెళుతుండగా ప్రమాదానికి గురై మృత్యువాత పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో జశ్వంత్ కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.

**గ్రామాల్లో విషాదఛాయలు**

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడంతో మోతిఘనపూర్, బీబీనగర్, బాలానగర్‌లలో విషాదఛాయలు అలుముకున్నాయి. కూరగాయలు, ఇతర వంటింటి వస్తువులను కొనుగోలు చేయడానికి వచ్చి తిరిగిరాని లోకాలకు వెళ్లారంటూ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.


**మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దిగ్భ్రాంతి**

జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాలానగర్ రోడ్డు ప్రమాదం తనను కలిచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**మెరుగైన వైద్యం అందించాలి : కలెక్టర్**

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జనవరి 5 : రోడ్డు ప్రమాదంలో ఐదుమంది దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన బాలానగర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. మృతదేహాలతోపాటు గాయపడిన వారిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఒకరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తలరించగా మరొకరికి ఇక్కడే చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఈ రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న కలెక్టర్ రవినాయక్ ప్రభుత్వ దవాఖానకు వెళ్లి మృతదేహాలను పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని దవాఖాన సూపరింటెండెంట్ రాంకిషన్‌ను ఆదేశించారు.


మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని స్థానికుల ఆందోళన


జాతీయ రహదారిపై మూడు గంటల తర్వాత ప్రారంభమైన రాకపోకలు


పాలమూరులో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశిస్తున్న కలెక్టర్

# సింగోటం జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

- 15 నుంచి 21 వరకు లక్ష్మీనర్సింహాస్వామి ఉత్సవాలు
- భక్తులకు సౌకర్యాలు కల్పించాలి
- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష


అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్, పర్యాటకశాఖల మంత్రి జూపల్లికృష్ణారావు

కొల్లాపూర్, జనవరి 5 : ఈనెల 15నుంచి 21వ తేదీ వరకు సింగవట్నంలో లక్ష్మీనర్సింహాస్వామి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ఆలయ ఆవరణలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలను తీసుకోవాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా జాతరలో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతంలో జాతరలో విధులు నిర్వహించిన సిబ్బంది కంటే మూడింతలు పెంచాలని ఆదేశించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు సమయం సమీపిస్తుండడంతో దేవాదాయ, ఇతర అధికారులు అంతా సన్నద్ధం చేసుకోవాలని జాతరలో పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని,జాతర ప్రాంగణంలో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఎక్సైజ్, అగ్నిమాపక, వైద్యారోగ్యశాఖ అధికారులతో శాఖల వారీగా మంత్రి సమీక్ష నిర్వహించారు. అంతకుముందు కొల్లాపూర్ డిపోకు నూతనంగా వచ్చిన ఎక్స్‌ప్రెస్ బస్‌ను మంత్రి ప్రారంభించి అదే బస్సులో సింగవట్నం వరకు ప్రయాణించారు. కార్యక్రమంలో అదనపు రెవెన్యూ కలెక్టర్ సీతారామారావు, ఆర్డీవో నాగరాజు, డీఎస్పీ మోహన్‌కుమార్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ రఘునాథ్‌రావు, ధూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సంపత్‌కుమార్‌శర్మ, ఈవో రంగారావు, డీఎంహెచ్‌వో సుధాకర్‌లాల్, అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకట్‌దాస్, తాసీల్దార్లు శ్రీకాంత్, హిమబిందు, ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు, జెడ్పీటీసీ జూపల్లి భాగ్యమ్మ, సర్పంచ్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాభివృద్ధి కోసమే ప్రజాపాలన**

పెంట్లవెల్లి, జనవరి 5 : ప్రజాభివృద్ధి కోసమే తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం చేపట్టిందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సర్పంచ్ సువర్ణ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులందరూ ఆరు గ్యారెంటీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరు గ్యారెంటీల కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదని అధికారులే మీ గ్రామాలకు వచ్చి దరఖాస్తులు తీసుకుంటారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామయ్య, తాసీల్దార్ హిమబిందు, ఎంపీవో భరత్ పాల్గొన్నారు.

**విద్యతో జీవితంలో పరిపూర్ణత సాధించాలి**

కొల్లాపూర్, జనవరి 5 : విద్య జీవితంలో పరిపూర్ణత సాధించడానికి దోహదపడుతుందని, చదువు కేవలం జీవితంలో విజయం సాధించడానికి కాదని ఎక్సైజ్ పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సికింద్రాబాద్ పీజీ కళాశాల విద్యార్థులు గ్రామీణ, గిరిజన క్షేత్ర పరిశీలన కార్యక్రమంలో భాగంగా కొల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని శుక్రవారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మంత్రి మాటాడుతూ ప్రశ్నించే తత్వం, ప్రతి అంశాన్ని హేతుబద్ధంగా విశ్లేషించడం, సృజనాత్మక, ఊహాత్మక భావస్వేచ్ఛ వంటి వాటిని అలవర్చుకోవాలని సూచించారు.

**సమస్యల పరిష్కారానికే మార్నింగ్ వాక్**

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలో మంత్రి జూపల్లి మార్నింగ్ వాక్ చేశారు. పట్టణంలో పలు వార్డుల్లో తిరుగుతూ ప్రజలను పలుకరిస్తూ, సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను తక్షణం అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కొల్లాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 9మంది మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ మంత్రి ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో వెంకటరమణమ్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.